


20 నెలల్లో ముగ్గురు సీఐలు!

- గోనెగండ్ల పోలీసు స్టేషన్‌లో బదిలీలు



గోనెగండ్ల పోలీస్‌స్టేషన్

గోనెగండ్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌పై పోలీసు ఉన్నతాధికారులకు ఎలాంటి అభిప్రాయం ఉందో తెలియదు కాని ఇక్కడికి వచ్చిన సీఐలు ఆరు, ఏడుమాసాలు ముగి యక ముందే బదిలీపై వెళుతున్నారు. 20మాసాల్లో ముగ్గురు సీఐలు మా రారు. ఒకరు ఆరు మాసాల రెండు రోజులు, మరొకరు ఏడు మాసా ల ఆరు రోజులు, ఇంకొకరు ఎనిమిది మాసాలు విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్నారు. ఫిబ్రవరి 2024కంటే ముందు గోనెగండ్ల స్టేషన్‌కు ఎస్ఐ మాత్రమే హౌస్ ఆఫీసర్‌గా ఉండేవారు. ఎస్ఐలు ఉ న్నంత కాలం ఏడాదిన్నర, లేక రెండేళ్ల విధులు నిర్వహించి బదిలీపై వెళ్లేవారు. అజిల్లాలో కొన్ని పోలీస్‌స్టేషన్లు అప్‌గ్రేడ్ కావటంలో భా గంగా గోనెగండ్లకు సీఐ పోస్టు వచ్చింది. 5.02.2024న రామ కృష్ణ య్యా సీఐగా బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికలు ముగిశాక రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చింది. రామకృష్ణయ్య 07.08.2024న బదిలీపై వెళ్లిపోయారు. తర్వాత గంగాధర్ సీఐగా 07.08.2024 బా ధ్యతలు చేపట్టారు. 13.03.2025న ఆస్పరికి బదిలీ అయ్యారు. 13.03. 2025న విజయభాస్కర్ సీఐగా బాధ్యతలు చేపట్టి, 13.11.2025 న ఏసీబీకి వెళ్లిపోయారు. సీఐల బదిలీలు రాజకీయ జోక్యంతో జరుగు తున్నాయా? లేక యాదృశ్చికంగా జరుగుతున్నాయా? అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం గోనెగండ్ల సీఐగా ఎమ్మిగ నూరు రూరల్ సీఐని ఇన్‌చార్జిగా ఉన్నతాధికారులు నియమించారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి



కర్నూలు లీగల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కోర్టులో జిల్లా న్యాయాధికారులతో సమావేశం నిర్వహించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రతి న్యాయాధి కారి తమ కోర్టుల్లోని కేసులను పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. నిర్మాణంలో ఉన్న కోర్టు భవనాలను త్వరగా పూర్తిచేసేలా పర్యవేక్షించాలన్నారు. అనంతరం కోర్టుల వారీగా పెండింగ్ కేసుల పురోగతిని న్యాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయాధికారులు పి.కమలాదేవి, పి.జే.సుధ, అమ్మనరాజు, పి.వాసు, లక్ష్మీరాజ్యం, ఏసీబీ న్యాయాదికారి శ్రీవిద్య, సీబీఐ కోర్టు న్యాయాధికారి ఎం.శోభారాణి, పెక్సో కోర్టు న్యాయాధికారి ఇ.రాజేంద్రబాబు పాల్గొన్నారు.



ఇక ప్రారంభమే...!

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. మౌలిక వసతులు లేక.. పంపిణీకి నోచుకోక టిడ్కో ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం కారణంగా పట్టణ పేదల సొంతింటి నిర్మాణం కలగానే మిగిలింది. కూటమి ప్రభుత్వం రావడంతో తక్షణమే పంపిణీ చేస్తారని ఆశించినా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. 18 నెలలు గడిచిపోయాయి. రూ.వందల కోట్లు వెచ్చించి నిర్మించిన ఇళ్లు నిరుపయోగంగా మారాయి. జూన్‌లో పంపిణీ చేస్తామన్నారు. నెలలు గడిచినా ఆ దిశగా చర్యలు శూన్యం. వైసీపీ హయాంలో ఐదేళ్లు పట్టించుకోకపోవడంతో ముళ్ల పొదలు నిండిపోయి శిథిలావస్థకు చేరడం, మౌలిక వసతులు లేకపోవడం ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం టిడ్కో గృహ ప్రవేశాలకు ముహూర్తం ఖరారు చేసింది. తొలి విడతగా సోమవారం 187 ఇళ్ల గృహ ప్రవేశం చేయనున్నారు. దశల వారీగా 2026 మార్చి ఆఖరులోగా లబ్ధిదారులకు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆ వివరాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- 17న టిడ్కో గృహాల ప్రవేశానికి ముహూర్తం
- తొలి విడత కర్నూలు నగరంలో 187 ఇళ్లు
- మున్సిపాలిటీ, టిడ్కో అధికారుల సన్నాహాలు
- మార్చి ఆఖరు నాటికి వంద శాతం పంపిణీ లక్ష్యం

కర్నూలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ పేదల స్వంతింటి స్వప్నం సాకారం చేయాలనే లక్ష్యంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన-ఎన్టీఆర్ ఇళ్ల పథకం ఫేజ్-1 కింద కర్నూలు నగరం, ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల పట్టణాల్లో 27,976 ఏపీ టిడ్కో ఇళ్లు మంజూరు చేశారు. రూ.1,650 కోట్ల అంచనాతో షేర్‌వాల్ టెక్నాలజీతో జీ ప్లస్-3 ఇళ్ల సముదాయ నిర్మాణాలు చేపట్టారు. మహారాష్ట్రకు చెందిన షాపూజీ,పల్లంజీ సంస్థ పనులు చేపట్టింది. ఏపీ టౌన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ టిడ్కో) ఇంజనీర్ల పర్యవేక్షణలో పనులు పెట్టారు. కర్నూలు నగర శివారున బైపాస్ రోడ్డు పక్కన 10 వేలు, ఎమ్మిగనూరు, ఆదోని, నంద్యాల పట్టణాల్లో 18,976, ఫేజ్-2 కింద డోన్, ఆళ్లగడ్డ 2,610 ఇళ్లు మంజూరు చేశారు. అంటే రెండు విడతల్లో 31,586 ఇళ్లకు గానూ 29,672 ఇళ్లు నిర్మాణాలు మొదలు పెట్టారు. 23,645 ఇళ్లను దాదాపుగా పూర్తి చేశారు. మౌలిక వసతులు కల్పించి గృహ ప్రవేశాలు చేయాల్సిన సమయంలో 2019 మేలో వైసీపీ ప్రభుత్వం రావడం టిడ్కో ఇళ్లకు శాపంగా మారింది. ఐదేళ్లు నిర్లక్ష్యంగా వదిలేయడంతో ముళ్లపొదలు నిండిపోవడమే కాకుండా పలు ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. కర్నూలు నగరంలో టిడ్కో ఇళ్లలో దొంగలు పడి రూ.కోట్లు విలువ చేసే విద్యుత్ వైర్లు, పరికరాలు దోచుకెళ్లారు.

మార్చి ఆఖరులోగా వంద శాతం

టిడ్కో ఇళ్ల సముదాయంలో మౌలిక వసతులు కల్పించి దశలవారీగా లబ్ధిదారులకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి శనివారం గృహ ప్రవేశాలు చేయించాలని, 2026 మార్చి ఆఖరులోగా వంద శాతం లక్ష్యం పూర్తి చేయాలని మున్సిపల్, ఏపీ టిడ్కో అధికారులకు లక్ష్యాలను నిర్దేశించారు. మౌలిక వసతుల కల్పన, పెండింగ్ బిల్లుల చెల్లింపు, అసంపూర్తి పనులకు దాదాపు రూ.180.03 కోట్లు అవసరమైని అంచనా వేశారు. నిధులు ఇస్తేకానీ పనులు చేయలేమని కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు.

కర్నూలు నగరం జగనాథగట్టులో నిర్మించిన టిడ్కో ఇళ్లు



ఉమ్మడి జిల్లాలో టీడీపీ ఇళ్ల పురోగతి వివరాలు

నగరం/పట్టణం	ఒప్పందం చేసిన ఇళ్లు	మొదలు పెట్టినవి	పూర్తైన ఇళ్లే	లబ్ధిదారులకు పంపిణీ చేసినవి
కర్నూలు నగరం	10,000	10,000	8,829	2,064
ఆదోని	4,704	4,720	3,494	1,632
ఎమ్మినూరు	4,272	4,272	4,272	1,920
నంద్యాల పట్టణం	10,000	9,000	5,370	2,096
డోన్	306	288	288	--
ఆళ్లగడ్డ	2,304	1,392	1,392	1,392
మొత్తం	31,586	29,672	23,645	7,008

17 నుంచి దశలవారీగా గృహ ప్రవేశాలు

అసంపూర్తి పనులు పూర్తి చేసి దశల వారిగా టిడ్కో ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2026 మార్చి ఆఖరులోగా వంద శాతం ఇళ్లు పేదలకు అప్పగించాలని లక్ష్యం. కర్నూలు నగరంలో సోమవారం 17న తొలి విడతగా 187 ఇళ్ల గృహ ప్రవేశాలకు ముహూర్తం ఖరారు చేశారు. మౌలిక వసతుల కల్పనకు నిధులు సమస్య లేదు. కాంట్రాక్టర్ పనులు చేసి బిల్లులు పెట్టగానే అమరావతిలోని ఏపీ టిడ్కో హెడ్ ఆఫీస్‌కు పంపగానే బిల్లులు మంజూరవుతాయి.
- నాగమోహన్, ఎస్ఈ, ఏపీ టిడ్కో, కర్నూలు

కావాల్సిన నిధులు రూ.కోట్లలో

పనులు	కర్నూలు	నంద్యాల
పెండింగ్ బిల్లులు	1.97	19.45
అసంపూర్తి పనులు	61.78	61.25
మౌలిక వసతులు	5.16	30.42
మొత్తం	68.91	111.12

కర్నూలులో టిడ్కో ఇళ్ల దుస్థితి



పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

- కలెక్టర్ డాక్టర్ సిరి



నన్నూరు పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ సిరి

ఓర్వకల్లు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన పరిసరాలు, సమాజంతోనే ఆరోగ్యంగా జీవించగలమని కలెక్టర్ సిరి అన్నారు. శనివారం ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామ పంచాయతీలో స్వర్ణాంధ్ర..స్వ చ్ఛాంధ్ర కార్యక్రమానికి ఆమె హాజర య్యారు. వ్యక్తిగత, సహజ పరిశుభ్రత థీమ్‌తో నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ పాల్గొని, జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిరి మాట్లా డుతూ ప్రతి నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సమాజ పరిశు భ్రతను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. చిన్నప్పటి నుంచి నుంచి అల వాట్లు నేర్పిస్తే జీవితాంతం పిల్లలు అదే బాటలో పయనిస్తారని తల్లిదండ్రులకు సూచించారు. రాబోయే తరం పిల్లలకు ఆస్తులు ఇవ్వడం కన్నా మట్టిని, గాలిని, నీటిని సంరక్షించుకొని వారికి ఇవ్వాల న్నారు. జిల్లాలో 56శాతం మాత్రమే అక్షరాస్యత ఉందన్నారు. ప్రతి ఒక్కరు చదువుకునేందుకు అనేక అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వంట గదిని పరిశీలిస్తూ మెను ప్రకారం విద్యార్థు లకు భోజనం అందించాలని వంట సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఆర్డీవో సందీప్ కుమార్, డీపీఓ భాస్కర్, ఎంపీడీఓ నాగ అనసూయ, తహసీల్దార్ విద్యాసాగర్, రమణా రెడ్డి, సర్పంచ్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు ప్రత్యేక స్థానం

- అధికారులు, సిబ్బంది అంకిత భావంతో పని చేయడమే కారణం
- క్రస్ట్‌గేట్స్ రిటర్నింగ్ అండ్ లిఫ్టింగ్ ప్రాసెస్ కీలకం
- సీఈ కబీర్‌బాషా



డ్యాంసైట్ వద్ద కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఈ కబీర్‌బాషా

శ్రీశైలం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ప్రాజెక్టుకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక స్థానం ఉందని ఇరిగేషన్‌శాఖ చీఫ్ ఇంజనీర్ కబీర్‌బాషా అన్నారు. శనివారం డ్యాంసైట్ వద్ద అధికారులు సిబ్బం దితో ఎస్ఈ బాలచంద్రారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభకు ముఖ్య అతిథిగా సీఈ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగువ నుండి విడుదలైన వరద ప్రవాహాన్ని పసిగడుతూ దిగువ ప్రాజెక్టుల పూర్తిస్థాయి నిల్వలను దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాజెక్టుల తీరాలలో ఉండే గ్రామాలు, పట్టణాలు, నగరాలకు ముంపు ప్రమాదాలు వాటిల్లకుండా అధికారులు సిబ్బంది సమన్వయంతో చేస్తు న్నారని అన్నారు. ఇందులో క్రస్ట్ గేట్ల రిటర్నింగ్ అండ్ లిఫ్టింగ్ ప్రాసెస్ అత్యంత కీలకమైనదని అన్నారు. అధికారులు, సిబ్బంది కు టుంబ, స్నేహపూర్వక వాతావరణం మధ్య విధులు నిర్వహించడం వల్ల విజయాన్ని సాధించడం సాధ్యమైందని ఎస్ఈ బాలచంద్రారెడ్డి అన్నా రు. అనంతరం సిబ్బంది, అధికారులను ప్రశంసా పత్రాలు, నూతన వస్త్రాలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈఈ వేణు గోపాల్‌రెడ్డి, డీఈలు తిప్పేస్వామి, గోపాల్‌నాయక్, చిట్టిబాబు, ఏఈలు మల్లికార్జున, సుదర్శన్, రెడ్డి, సామేల్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి

డీఈవో శ్యామూల్ పాల్



నందరంలో విద్యార్థిని భోజనం వడ్డిస్తున్న డీఈవో శ్యామూల్‌పాల్

నందవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని, ఇందుకు ఉపాధ్యా యులు కలసి కట్టుగా పనిచే యాలని డీఈవో శ్యామూల్ పాల్ సూచించారు. శనివారం నందవరం హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా? అని విద్యార్థు లను అడిగారు. అనంతరం స్కూల్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికను అమలు చేసి ఉత్తీ ర్ణత శాతాన్ని పెంచాలన్నారు. సాయంత్రం స్టడీ అవర్స్‌లో స్నాక్స్ అంద జేయాలని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులపైన ప్రత్యేక దృష్టి సారించి వారి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బసవరాజు, ముగతి ఈరన్న, విరుపాక్షి, చంద్రశేఖర్, ఉమాపతి, నూరాజ్ పాల్గొన్నారు.

గాజులదిన్నె ప్రాజెక్టు కట్ట దిగువ ప్రాంతంలో పంట భూములు



భూమికి పచ్చాని రంగేసినట్లు..

భూమికి పచ్చని రంగేసినట్లు వరి పంట కళకళలాడుతోంది. గోనెగండ్ల మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు(జీడీపీ) దిగువ ప్రాంతం, హెచ్ కైరవాడి, గాజులదిన్నె, పుట్టపాశం, వేముగోడు, పరసర గ్రామాలు వరి పంట పచ్చదనంలో పులకిస్తున్నాయి. ఈ ప్రాంతంలో వరి సాగును చూస్తుంటే కోనసీమను తలపిస్తుంది. చుట్టూ నీరు పచ్చని పైర్ల మధ్య ఒంపులు తిరిగిన కాలి బాటలు ఎంతో సుందరంగా కనువిందు చేస్తాయి. పంటల మధ్యలో చల్లని నీడనిచ్చే చెట్లు ఉన్నాయి. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల వెంట వరి సాగు జోరుగా చేపట్టారు. సాయంత్రం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వాకింగ్‌కు వచ్చి సూర్యాస్తమయం వరకు అక్కడే ఉండి సేదతీరి పోతుంటారు.

- గోనెగండ్ల ఆంధ్రజ్యోతి

క్లస్టర్ వర్సిటీలో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూని వర్సిటీ పరిధిలోని కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల్లో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నామని రిజిస్ట్రార్ జీ. శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 17 నుంచి 20 తేది వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 22 నుంచి 24 వరకు ఒరిజనల్ ధ్రువపత్రాలు, కాలేజీ ఫీజును కాలేజీల్లో చెల్లించి, అడ్మిషన్లు పొందాలని తెలిపారు.



కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేస్తున్న యాత్రికులు

శ్రీశైలంలో పెరిగిన భక్తుల రద్దీ

శ్రీశైలం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహా పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసుకుని కార్తీక దీపాలు వెలిగించేందుకు భక్తులు వేలాదిగా తరలిరావడంతో శనివారం క్షేత్ర ప్రాంతాలన్నీ రద్దీగా కనిపించాయి. యాత్రికులతో శ్రీగిరిలోని వసతి సముదాయాలు కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు దర్శనాలు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకున్నట్లు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. స్వామిఅమ్మవార్ల ఉభయ దేవాలయాల్లో అందరికీ అలంకార దర్శనం మాత్రమే ఉన్నందున దర్శనానికి రెండు గంటల సమయం మాత్రమే పడుతోందని ఆలయ అధికారులు తెలిపారు.



కంపార్ట్‌మెంట్‌లో వేచిఉన్న భక్తులు

పరిశ్రమల్లో డేటా సైన్స్ అవసరం

● జర్మనీ ఎల్‌పీడీజీ సంస్థ సీఈవో మాథియాస్



ఆర్జీఎం కళాశాల అధ్యాపకులతో సీఈవో మాథియాస్

పాణ్యం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం డేటా సైన్స్ ఆవశ్యకత పరిశ్రమల్లో ఎంతో అవసరమని జర్మనీకి చెందిన లెహ్మాన్ పయనీర్స్ డిజిటల్ గ్రూప్ సంస్థ సీఈవో మాథియాస్ అన్నారు. శనివారం ఎల్‌పీడీజీ ఇండియా డైరెక్టర్ రంజిత్, డేటాసైంటిస్ట్ కల్యాణతో కలిసి ఆయన ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించారు. విద్యార్థులకు డేటా సైన్స్ ప్రాముఖ్యత, భవిష్యత్తు అవకాశాలు, పరిశ్రమల్లో పెరుగుతున్న అవసరం గురించి వివరించారు. ముఖ్యంగా డేటా ఆధారిత నిర్ణయాల ప్రాముఖ్యతపై అంతర్జాతీయ కంపెనీల్లో డేటా సైన్స్ నైపుణ్యాల డిమాండ్‌పై అవగాహన కల్పించారు స్టార్టప్, పరిశోధన, ఆవిష్కరణల రంగాలలో కృషి చేయనున్నట్లు తెలిపారు. కళాశాలలో ఇన్నోవేషన్ అండ్ ఇన్‌క్యూబేషన్ సలహాదారుడిగా కొనసాగేందుకు అంగీకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, సీఎస్ఈ (డేటాసైన్స్) హెచ్‌వోడీ భాస్కరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి


మంత్రాలయంలో కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ సచిన్ శంకర్ మగదూమ్

మంత్రాలయం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సచిన్ శంకర్ మగదూమ్ కుటుంబ సమేతంగా శనివారం మంత్రాలయానికి వచ్చారు. మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి వీరికి ఘనంగా స్వాగతం పలికారు. జడ్జి, ఆయన కుటుంబ సభ్యులు గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట అనంత పురాణిక్, సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజిల్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి


రాజేశ్(ఫైల్)

ఆదోని రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలంలోని ఢణాపురం శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ రాజేశ్(30) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఆదోని పట్టణానికి చెందిన రాజేశ్ వృత్తి రీత్యా ఫొటోగ్రాఫర్. ఇందులో భాగంగానే ఆలూరు నియోజకవర్గం హాలహర్వి మండలంలో ఓ శుభకార్యానికి స్నేహితుడు ఈరన్నతో కలిసి శుక్రవారం ఉదయం బయల్దేరాడు. సాయంత్రం తిరిగి ఆదోనికి ద్విచక్ర వాహనంలో బయల్దేరారు. ఢణాపురం శివారులో వీరికి పశువులు అడ్డు రావడంతో వాటిని తప్పించే క్రమంలో బైకు అదుపుతప్పింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ రాజేశ్‌ను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బాధిత బంధువులు ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అర్ధరాత్రి రాజేశ్ పరిస్థితి మరింత విషమంగా ఉండడంతో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు.

కోరుమానుపల్లెలో పట్టపగలే చోరీ

● 4 తులాల బంగారం, రూ.6వేల నగదు అపహరణ


దుండుగలు తెరిచి ఉంచిన బీరువా

కొలిమిగుండ్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరుమాన్‌పల్లె గ్రామంలో శనివారం పట్టపగలే చోరీ జరిగింది. గ్రామానికి చెందిన రాజారెడ్డి కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి గ్రామ సమీపంలో జరుగుతున్న గుండం ఆంజనేయస్వామి తిరునాళ్లకు వెళ్లారు. తాళం వేసి పక్కన గూటిల్లో తాళంచెవులు పెట్టి వెళ్లారు. దీంతో తాళం ఓపెన్ చేసిన దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలోని 4 తులాల బంగారం, రూ.6 వేలు నగదు ఎత్తుకెళ్లారు. ఎస్ఐ గోపాల్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోక్సో కేసులో వ్యక్తికి రిమాండు

కోవెలకుంట్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పోక్సో యాక్టు కేసులో బొంతల రాజకుమార్‌కు కర్నూలు జిల్లా పోక్సో కోర్టు రిమాండు విధించినట్లు కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. వివరాలివీ.. చాగలమర్రికి చెందిన రాజకుమార్ పోక్సో కేసులో కర్నూలు కోర్టుకు వాయిదాలకు రాకుండా తప్పించుకుని తిరుగుతుండడంతో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, హెడ్ కానిస్టేబులు నాగన్న, పీసీ చాంద్‌బాషా కలిసి రాజకుమార్‌ను అరెస్టు చేశారు. కర్నూలు కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండుకు ఆదేశించినట్లు తెలిపారు

యువకుడి ఆత్మహత్య

కోవెలకుంట్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దాసరి వీధికి చెందిన ఓ యువకుడు ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం జరిగింది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలివీ..పట్టణంలోని దాసరి వీధిలో తల్లి సుజాత, కుమారుడు నట్వ గణేశ్ ఇద్దరూ నివాసం ఉంటున్నారు. గణేశ్ వండేమార్ట్‌లో ఏడాది క్రితం పనిచేసి ఇటీవలనే మానుకున్నాడు. తల్లి సుజాత ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తుండేది. శనివారం తల్లి పాఠశాలకు వెళ్లగా ఇంట్లో ఎవరు లేని సమయంలో నట్వ గణేశ్ (24) ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. తల్లి పాఠశాల నుంచి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో కుమారుడు ఉరి వేసుకొని కనిపించాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రావెల్స్ మినీ బస్సుకు భారీ జరిమానా



జప్తు చేసిన ట్రావెల్స్ మినీ బస్సు

డోన్ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అమకతాడు టోల్‌ప్లాజా వద్ద ఆర్టీవో అధికారులు ట్రావెల్స్ మినీ బస్సు భారీ జరిమానా విధించారు. హైదరాబాదు నుంచి యాగంటికి వెళుత్తున్న బస్సుకు ఎటువంటి ఫిట్‌నెస్ లేకుండా, ఏపీ రాష్ట్రానికి ట్యాక్స్ కట్టకుండా రోడ్డుపై నడుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. రూ.86,200 భారీ జరిమానా విధించినట్లు ఆర్టీవో క్రాంతికుమార్ తెలిపారు. మినీ బస్సును జప్తు చేసి డోన్ ఆర్టీసీ డిపోకు తరలించారు.

రైల్వే సీఐ సతీశ్ కుమార్‌కు ఘన నివాళి

● పత్తికొండలో ముగిసిన అంత్యక్రియలు

● నివాళులర్పించిన ప్రముఖులు, రాజకీయ నేతలు

పత్తికొండ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల పరకామణి చోరీ వ్యవహారంలో ఫిర్యాదుదారు, గుంతకల్లు రైల్వే డివిజన్ జీఆర్పీ సీఐ వై.సతీశ్‌కుమార్ అంత్యక్రియలు శనివారం పత్తికొండ పట్టణంలో ప్రభుత్వ అధికార లాంఛనాలతో జరిగాయి. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం కోమలి గ్రామ సమీపంలో రైల్వేట్రాక్ వద్ద శుక్రవారం ఉదయం ఆయన మృతదేహం కనిపించిన విషయం తెలిసిందే. అనంతపురం జీజీహెచ్‌లో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో స్వగ్రామమైన పత్తికొండకు మృతదేహాన్ని బంధువులు తీసుకొచ్చారు. అందరికీ సుపరిచితుడిగా ఉంటూ మంచి పేరు సంపాదించుకున్న సతీశ్ కుమార్ మృతదేహం పత్తికొండకు వచ్చిందన్న వార్త విన్న బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున తరలివచ్చి నివాళులర్పించారు. దీంతో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్, శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి తదితరులు సీఐ సతీశ్ కుమార్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా సీపీఐ రాష్ట్ర నాయకులు రామచంద్రయ్య, న్యాయవాది సురేంద్రకుమార్, వైసీపీ నాయకులు రామచంద్రారెడ్డి, నాగరత్నమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు క్రాంతినాయుడు, సీపీఎం పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. పోలీసు సిబ్బందితో కలిసి గుంతకల్లు రైల్వే డీఎస్పీ శ్రీనివాస ఆచారి నివాళులర్పించారు. రైల్వేశాఖ తరపున అంత్యక్రియలకు రూ.లక్ష నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం శ్మశాన వాటికలో రైల్వే పోలీసులు మూడు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపి అధికార లాంఛనాలతో అంతిమ సంస్కారాలను నిర్వహించారు.


అంతిమ యాత్రలో పాల్గొన్న తుగ్గలి నాగేంద్ర, పోలీసులు,

సతీష్‌కుమార్ మృతి బాధాకరం

పత్తికొండకు చెందిన సీఐ సతీష్‌కుమార్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో మంచి గుర్తింపు పొందారు. ఆయన అకాల మృతి చాలా బాధాకరం. ఈయన మృతి పట్ల ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తుంది. దీని వెనుక ఎంతటివారు ఉన్నా సరే ఉపేక్షించేది లేదు. పరకామణి కేసులో సీఐ సతీష్ కుమార్ నిక్కచ్చిగా వ్యవహరించారు. అప్పట్లో అనంతపురం జిల్లాకు చెందిన టీడీపీ నేత పరిటాల రవి హత్యకు గురైన కేసులో సాక్షులు ఒక్కొక్కరు మాయమయ్యారు. ఇప్పుడు సతీష్‌కుమార్ మృతిని గమనిస్తే అదే గుర్తుకు వస్తోంది. కేసులో ఉన్న సాక్షులను భయభ్రాంతులకు గురిచేసేలా ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్న నిందితులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది. ఈ సంఘటనలపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్తా. బాధిత కుటుంబానికి అండగా ఉంటాను.

- కేఈ శ్యామ్‌కుమార్, ఎమ్మెల్యే, పత్తికొండ

బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం

కుమ్మరి శాలివాహన సామాజికవర్గానికి చెందిన సతీశ్ కుమార్ మృతి సంఘటనలో ఎంతటివారు ఉన్నా ప్రభుత్వం వారిని వదిలిపెట్టదు. సతీశ్ కుటుంబానికి న్యాయం చేస్తాం. పరకామణిలో జరిగిన చోరీ కేసులో ప్రధాన సాక్షిగా ఉన్న సతీశ్‌ను కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులే హత్య చేసి ఉంటారు. ఇప్పుడిప్పుడే శాలివాహన సామాజికవర్గం, ఆర్థిక, రాజకీయంగా, ఉద్యోగాలపరంగా ఎదుగుతున్న తరుణంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరం.

● తుగ్గలి నాగేంద్ర, శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

విచారణ జరిపించాలి

రైల్వే సీఐ సతీశ్ కుమార్ మృతిపై అనుమానాలు ఉన్నాయి. సీబీఐ చేత విచారణ చేపట్టాలి. పరకామణి ఘటన కేసులో సాక్ష్యం చెప్పేందుకు వెళ్తున్న సీఐ స్థాయి అధికారి రైలులో వెళ్తూ హత్యకు గురికావడం దారుణం. టీటీడీలో ఇప్పటికే కల్తీ లడ్డు, పరకామణి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడాలి. బాధితా కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.

● రామచంద్రయ్య, సీపీఐ రాష్ట్ర నేత


మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్

టీజీవీ కళాక్షేత్రం ఖ్యాతి విశ్వవ్యాప్తం కావాలి

మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో కళాకారుల నిలయం టీజీవీ కళాక్షేత్రం ఖ్యాతిని విశ్వవ్యాప్తం కావాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ ఆకాంక్షించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్యకు ప్రతిష్ఠాత్మక జీవన సాఫల్య పురస్కారాన్ని తెలుగు బుక్ ఆఫ్ రికార్డు సంస్థ హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అందజేసి గౌరవించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో పత్తి ఓబులయ్యను ఎంపీ టీజీ వెంకటేశ్ శనివారం ఘనంగా సత్కరించారు. కళాక్షేత్రం సభ్యులు పాల్గొన్న ఈ సభలో టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ కర్నూలు కళాకారులకు కేరాఫ్‌గా ఉన్న టీజీవీ కళాక్షేత్రం సాంస్కృతిక నిలయంగా మారాలన్నారు. ఇతర సభ్యులు కూడా కళాసేవ చేస్తూ అవార్డులు అందుకోవాలన్నారు. పత్తి ఓబులయ్య కళాక్షేత్రం అభివృద్ధికి, కొత్త కళాకారులను తయారు చేయడంలో తన జీవితాన్ని ధారపోశారన్నారు. ఇలాంటి అవార్డులు ఆయన మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. తన జీవితంలో ఇంతటి గొప్ప అవార్డు రావడం మర్చిపోలేని ఘట్టమన్నారు. కళామతల్లి ముద్దుబిడ్డ టీజీ వెంకటేశ్ ప్రోత్సాహంతో పాటు కళాక్షేత్రం కార్యవర్గ సభ్యుల సహకారంతోనే ఇలాంటి ప్రతిష్ఠాత్మక అవార్డులు సొంతమవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి యాంగటీశ్వర్, కోశాధికారి కె.రామస్వామి, ఉపాధ్యక్షులు గజల్ మహ్మద్ మియ, సీవీ రెడ్డి, దాశెట్టి శ్రీనివాసులు, కళాక్షేత్రం సభ్యులు శివయ్య, కె.వి. రమణ, ఇనాయతుల్లా, సంగా ఆంజనేయులు, ఈశ్వరయ్య, బాల వెంకటేశ్వర్లు, ఎస్‌డీ క్రిష్టఫర్, కదిరి రమేష్, కాంతారావు, చంద్రకంటి మద్దయ్య, హెచ్‌ఎం వాల్మీకి రాముడు తదితరులు పాల్గొన్నారు.


పత్తి ఓబులయ్యను సత్కరిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

నేడు గజ్జ కట్టిన పల్లెబాట : కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు 'గజ్జ కట్టిన పల్లె బాట' పేరిట జానపద గేయాల సంగీత విభావరి కార్యక్రమం ఉంటుందని గజల్ గాయకులు మహ్మద్ మియ తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం పత్తి ఓబులయ్య ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి నగర ప్రజలు, సంగీత అభిమానులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రముఖ జానపద కళాకారులు ఖాజా వలి, మిమిక్రి ఆర్టిస్ట్ ఉస్మాన్ భాష, గాయకులు సుజాత తదితరులు పాల్గొంటారని తెలిపారు.

జార్ఖండ్ మత్స్యకారుల గుర్తింపు

● త్వరలో వారి సొంత ప్రాంతానికి తరలింపు

● ఎస్పీ ఆదేశాల మేరకు విచారణ

పగిడ్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో చేపల వేటకు వచ్చిన జార్ఖండ్ మత్స్యకారులను గుర్తించి వారి స్వగ్రామాలకు పంపిస్తున్నట్లు నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. జార్ఖండ్‌కు చెందిన తోఫుజుల్, అబుసోబ్‌సెట్ తమకు తెలిసిన వారి ద్వారా విజయవాడలోని కొండపల్లిలో కెమికల్ ఫ్యాక్టరీలో పని చేసేందుకు వచ్చారు. అక్కడ పని నచ్చకపోవడంతో తిరిగి వెళ్లేందుకు బస్టాండ్ ఆవరణలో తిరుగుతు ఉన్నారు. ఈ సమయంలో విజయవాడకు చెందిన సింహాచలం అనే వ్యక్తి కూలీ పని ఇప్పిస్తానని చెప్పి వారిని విజయవాడ నుంచి 20 రోజుల కిందట తెలంగాణ రాష్ట్రం కూడెల్లి వద్ద కృష్ణనదిలో చేపలు పట్టేందుకు తీసుకొనివచ్చారు. అక్కడ సరైన వసతులు లేకపోవడంతో వారు ఆ విషయాన్ని తమ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారు నంద్యాల ఎస్పీకి సమాచారం ఇచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ సిబ్బంది శనివారం ఉదయం నెహ్రూనగర్ గ్రామ సమీపంలోని మూర్వకొండ ఘాట్ నుంచి కృష్ణనదిలో ఇంజన్ బోట్‌లో నదీతీర ప్రాంతం వెంట ఉన్న మత్స్యకారుల క్యాంప్‌లను సందర్శించి జార్ఖండ్ మత్స్యకారుల కోసం గాలించారు. కేడేళ్లి వద్ద ఉన్న జార్ఖండ్ మత్స్యకారులను అదుపులోకి తీసుకొని విచారించారు. వారి స్వగ్రామాలకు పంపే ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


నదీతీరం వెంట జార్ఖండ్ మత్స్యకారుల కోసం విచారిస్తున్న సీఐ

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి

● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

డోన్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యమివ్వాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాయలసీమ యూనివర్సిటీ అంతర్ కళాశాల పోటీలకు ఎమ్మెల్యే కోట్ల ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక దృఢత్వానికి ఎంతో దోహద పడుతాయన్నారు. క్రీడల్లో రాణించేందుకు ఉపాధ్యాయులు కూడా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ పోటీల్లో ఫుట్‌బాల్, చెస్ పోటీలకు 15 జట్లు పాల్గొన్నాయి. అంతకు ముందు విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, రాయలసీమ యూనివర్సిటీ వీడీ శివకిషోర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, లక్కసాగరం లక్ష్మిరెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాఘవేంద్రగౌడు, మాజీ సర్పంచ్ పెద్ద కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, శాలివాహన కార్పొరేసన్ డైరెక్టర్ కుమ్మరి సుధాకర్, జలదుర్గం ఆర్ఈ నాగరాజు గౌడు, ఓంప్రకాష్, ప్రిన్సిపాల్ భారతి, గుండాల జయరాముడు, మోహన్‌గౌడు, పీడీ చంద్రశేఖర్, బ్రహ్మయ్య, రెహిమాన్, హుసేన్ పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తుత్న ఎమ్మెల్యే కోట్ల

ఇద్దరు వేటగాళ్ల అరెస్టు

● పరారీలో మరో ఇద్దరు

● అడవి పంది కళేబరం, 6 కత్తులు స్వాధీనం

రుద్రవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం ఫారెస్టు రేంజ్‌లోని అహోబిలం గ్రామ సమీపంలో వన్యప్రాణిని కరెంటు పెట్టి వేటాడిన కేసులో శనివారం ఇద్దరిని అరెస్టు చేసినట్లు రేంజర్ ముర్తుజావలి తెలిపారు. అహోబిలం చెందిన నాగేశ్వర్‌రెడ్డి, ఓబులేసును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెతెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారయ్యాని చెప్పారు. నిందితుల నుంచి ఆరు కత్తులు, అడవి పంది కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న కళేబరానికి పశువైద్యాధికారిచే పోస్టుమార్టం నిర్వహించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖననం చేసినట్లు ఆయన తెలిపారు. ఇన్‌చార్జి డిప్యూటీ రేంజర్ ముక్తర్‌బాషా, సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాస రెడ్డి, రామకృష్ణ, రాణెమ్మ, బీట్ ఆఫీసర్లు హుసేనయ్య, జేమ్స్‌పాల్, సురేంద్రగౌడ్ పాల్గొన్నారు.


రుద్రవరంలో వన్యప్రాణి వేటగాళ్లతో ఫారెస్టు రేంజర్, సిబ్బంది

ఉరేసుకొని విద్యార్థి బలవన్మరణం

నంద్యాల టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో పదో తరగతి విద్యార్థి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నంద్యాలలో శనివారం చోటు చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. పట్టణంలోని ముల్లాన్‌పేటకు చెందిన ప్రజ్వల్ (15) స్థానిక ఒక ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సరిగా వెళ్లేవాడుకాదు. పరీక్షలు దగ్గర పడుతుండటంతో సరిగా రాయలేకపోతానేమోనని కలత చెందేవాడు. తండ్రి దినేశ్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. తల్లి ప్రవళ్లిక స్థానిక నర్సింగ్‌హోం నర్సుగా పని చేస్తున్నారు. ఉదయం పాఠశాలకు వెళ్లమని చెప్పి ఆస్పత్రికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మనస్థాపం చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసేలోగా మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రామ్‌కో పరిశ్రమలో పశ్చిమ బెంగాల్ కార్మికుడి మృతి


గోపాల్‌ఆచార్ (ఫైల్)

కొలిమిగుండ్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో మెకానిక్ విభాగంలో గ్రైండర్‌గా విధులు నిర్వహిస్తున్న పశ్చిమబెంగాల్ కార్మికుడు నాని గోపాల్ ఆచారి (51) శనివారం మృతి చెందాడు. ఉదయం కొళాయి వద్ద నీరు తాగుతుండగా అకస్మాత్తుగా కింద పడిపోయారని తోటి కార్మికులు తెలిపారు. పరిశ్రమ సిబ్బంది గోపాల్ ఆచారిని తాడిపత్రి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు నాని గోపాల్ ఆచార్ పశ్చిమబెంగాల్ రాష్ట్రం రుబ్రామెదినిపూర్ జిల్లా వాసిగా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్‌బాబు వెల్లడించారు. ఇదిలా ఉండగా గత కొన్ని రోజులుగా రామ్‌కో పరిశ్రమలో కార్మికుల మరణాలు కలవరపెడుతున్నాయి. ఫ్యాక్టరీలో చోటు చేసుకుంటున్న పరిణామాలు, కార్మికుల మరణాలపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

నోడల్ అధికారులు, అసిస్టెంట్ల నియామకం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని 133 సచివాలయాలకు నోడల్ అధికారులు, అసిస్టెంట్లను నియమిస్తూ కమిషనర్ పి. విశ్వనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో సచివాలయాల పనితీరుపై వచ్చిన కథనాలకు కమిషనర్ స్పందించారు. రెవెన్యూ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందిని ప్రత్యేక నోడల్, అధికారులుగా నియమించారు రోజూ పర్యవేక్షించి నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పుస్తకావిష్కరణ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి వి.పెద్దక్క అల్లూరి సత్యనారాయణరాజు చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి, కల్యాకర చంద్రశేఖర్, ముచ్చుకోట చంద్రశేఖర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్‌డీ అజీజ్ ఈ పుస్తకాన్ని రచించారని స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. రచయిత ఇనాయతుల్లా, లైబ్రేరియన్ వజ్రాల గోవిందరెడ్డి, ఎస్.బాషా, నషామీ, బి.రేణుక, పద్మావతమ్మ, సీనియర్ అసిస్టెంట్ ఎన్.మక్బూల్ బాషా పాల్గొన్నారు.


ఎంప్లాయ్‌మెంట్ అధికారిని సన్మానిస్తున్న ప్రతినిధులు

ఇక్కడ చెత్త.. అక్కడ ప్రతిజ్ఞ


ఈ చెత్త కనిపించలేదా? ఈవీఎం గోడౌన్ల వద్ద చెత్తాచెదారం


దేనికోసం ఈ ప్రతిజ్ఞ? పార్కులో ప్రతిజ్ఞ చేస్తున్న డీఆర్వో, అధికారులు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తూ పరిసరాలను, కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తుంటే జిల్లా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లా పరిపాలనా కేంద్రం కలెక్టరేట్ ప్రాంగణంలో చెత్త కనిపిస్తున్నా పట్టించుకోవడం లేదు. శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలోని పార్కులో పోలీసులచే ప్రజలను పంపించి వేసి, డీఆర్వో ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేసి వెళ్లారు. అయితే పక్కనే ఉన్న ఈవీఎం గోడౌన్ల వద్ద చెత్త విపరీతంగా ఉండి దుర్వాసన వస్తోంది. మరి ఈ అధికారులకు ఆ చెత్త కనిపించలేదో, ముక్కు మూసుకుని వెళుతున్నారో అర్థం కావడం లేదని, ఇక ప్రతిజ్ఞ చేయడం ఎందుకని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

● కలెక్టర్ డాక్టర్ సిరి



కర్నూలు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలనకు కృషిచేయాలని కలెక్టర్ సిరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో బాల్యవివాహాల నిర్మూలన, వరకట్ననిషేధం అంశంపై ఆర్డీవోలు, పోలీస్ అధికారులు, ఎన్జీవోలతో సమావేశం నిర్వహించారు. సచివాలయంలో మహిళా పోలీసు ద్వారా బాల్యవివాహాలు చేసేవావారి వివరాలు సేకరించి, గ్రామస్థాయి కమిటీలు ఫాలో అప్ చేయాలన్నారు. ఏఎస్పీ హుసేన్‌పీరా, ఆర్డీవోలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

● ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి


ఆసుపత్రిలో హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కోడుమూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆదేశించారు. శనివారం పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది హాజరు, శుభ్రత, రోగుల అందిస్తున్న వైద్య సేవలు, మందుల లభ్యత, సేవలపై డాక్టర్ నాగరాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులను పలకరించి, వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకొన్నారు. సీజనల్ వ్యాధులు టైఫాయిడ్, మలేరియా ప్రబలుతున్నాయని, వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. గుండె జబ్బుల రోగులకు ప్రథమ చికిత్సలో భాగంగా రూ.45వేల ఇంజెక్షన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. బాధితులు గమనించి అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి రావాలన్నారు. అనంతరం జడ్పీ బాలిక ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ పాటించాలని, శుచితో రుచికరమైన నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసి, గతంలో ఇద్దరు విద్యార్థులపై దాడి ఘటన బాధాకరమని, పునరావృతం కాకుండా చూడాలని వార్డెన్‌ను ఆదేశించారు. ఇకపై ప్రభుత్వం అధికారుల పని తీరుపై ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తానని విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కర్నూలు రూరల్: పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత అని కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి పేర్కొన్నారు. శనివారం పసుపుల గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శి హేమంత్ కుమార్‌రెడ్డి, సర్పంచ్ బొగ్గుల శీలమ్మ పాల్గొన్నారు.

ఆదమరిస్తే గుంతలోకే!



నగరంలోని సప్తగిరి నగర్ కొత్త అయ్యప్ప స్వామిగుడి వద్ద మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా, వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఈ దారిలో నిత్యం కార్లు, బైకులు, ఆటోలు వందల సంఖ్యలో తిరుగుతుంటాయి. మున్సిపల్ అధికారులు మ్యాన్‌హోల్‌ను మూసివేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

\- కర్నూలు న్యూసిటీ

నాటక ప్రదర్శన బ్రోచర్ విడుదల


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కేవీ సుబ్బారెడ్డి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భువన విజయం నాటక ప్రదర్శన బ్రోచర్‌ను కేవీ సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. పద్య నాటక చరిత్రలో గొప్ప అధ్యయనంగా భువన విజయం నాటకం నిలిచి పోతుందన్నారు. రంగస్థలం కళాకారుల సంక్షేమ సంఘం అధ్వర్యంలో ఏపీ నాటకాడమీ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ప్రదర్శిస్తున్నట్లు గుర్రపుశాల అంకయ్య తెలిపారు. ఆదివారం మద్దూర్‌నగర్‌లోని తెలుగు తోటలో సాయంత్రం 6:30 గంటలకు ఉంటుందన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కోడుమూరు రూరల్, నవంబరు 15, (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కృష్ణాపురం టీడీపీ నాయకులు అన్నారు. శనివారం రైతు సేవా కేంద్రంలో 175 క్వింటాళ్ల యూరియా బస్తాలను రైతులకు పంపిణీ చేశారు. జీడీపీ నీటి సంఘం అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే దస్తగిరి సహకారంతో రబీలో రైతులకు అవసరమైన యూరియా పంపిణీ చేశామన్నారు. మాజీ సర్పంచ్ చిన్నహనుమంతు, గ్రామకమిటీ ఉపాధ్యక్షుడు సురేష్‌బాబు, వ్యవసాయ సిబ్బంది ప్రదీప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్కింగ్ సమస్యలకు చెక్


డయాగ్నోస్టిక్ బ్లాక్ వద్ద చేస్తున్న పనులు

కర్నూలు హస్పిటల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెద్దాసుపత్రిలో పార్కింగ్ సమస్య పరిష్కరించేందుకు సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు చర్యలు తీసుకున్నారు. శనివారం న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్ల ఆధ్వర్యంలో సీసీ ఫ్లోరింగ్ పనులను ప్రారంభించారు. ఏపీ ఎంఎస్ఐడీసీ ఈఈ చీరంజీవులు, డీఈ శిల్పశ్రీ పనులను పరిశీలించి, నాణ్యతతో చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అలాగే న్యూ డయాగ్నస్టిక్ బ్లాక్, ట్రామా కేర్ పక్కన, ఫీమెల్ మెడికల్ వార్డు ముందు, సూపర్ స్పెషాల్టి ఓపీ సమీపంలో పార్కింగ్ స్థలాలను ఎంపిక చేశామని తెలిపారు.

ప్రమాణ స్వీకారోత్సవం జయప్రదం చేయండి


మట్లాడుతున్న చంద్రన్న

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 15(ఆంధ్ర జ్యోతి): ఎస్టీ కమిషన్ చైర్మన్, మెంబర్ వెంకటప్ప ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప పిలుపునిచ్చారు. శనివారం మాట్లాడుతూ సోమవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం విజయవాడలో ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకరం ఉంటుందన్నారు. యేగేశ్ నాయక్, వెంకటేశ్, శివ, రాజీవ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

తిరునాళ్లు ప్రారంభం


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

కోడుమూరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరి గ్రామంలో రామదాసుస్వామి తిరునాళ్ల శనివారం ఆరంభమైంది. శనివారం రాత్రి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో వుంచి మేళతాళాలతో స్మారకమందిరం దగ్గరకు తెచ్చి, గ్రామోత్సవం నిర్వహించారు. 16న నందికోలసేవ, 17న రథోత్సవం, 18న పారువేట, 19న వసంతోత్సవ వేడుకలతో తిరుణాల ఉత్సవాలు ముగియనున్నాయి.

● డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు.

పౌష్టికాహారం ఇవ్వాలి

కర్నూలు న్యూసిటీ/కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని కలెక్టర్ డా.సిరి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి సీడీపీవోలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉదయం 9 గంటలకల్లా కేంద్రాలను తెరవాలని, పిల్లలందరూ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. తప్పుడు వివరాలు నమోదు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శిథిలమైన భవనాల్లో పిల్లలను ఉంచవద్దని, అద్దె భవనంలో నిర్వహించుకోవాలన్నారు. గర్భిణులకు టేక్ హోమ్ రేషన్ కింద అందిస్తున్న 11 సరుకులను ఖచ్చితంగా అందించాలని కలెక్టర్ ఆదేశించారు. మద్దికెర, హలహర్వి, మంత్రాలయం మండలాల్లో పిల్లల వయసుకు తగ్గ బరువులో వెనుకబడి ఉన్నారని, క్రిష్ణగిరి, కల్లూరు, హలహర్వి మండలాల్లో ఎత్తుకు తగ్గ బరువు అంశంలో వెనుకబడి ఉన్నారని అన్నారు. ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ అంశంలో మద్దికెర, ఆలూరు, కర్నూలు అర్బన్ మండలాలు వెనుకబడి ఉన్నాయని, చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ విజయ, సీడీపీవోలు పాల్గొన్నారు.

దోషులను శిక్షించాలి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరాకమణి చోరీ కేసులో రైల్వే సీఐ కుమ్మరి సతీష్‌కుమార్ హత్య కేసులో విచారణ ఏసి నిందితులను శిక్షించాలని శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పీవీబీ సుబ్బయ్య ప్రకటనలో డిమాండ్ చేశారు. శనివారం పత్తికొండలో సతీష్‌కుమార్ అంత్యక్రియల్లో పాల్గొన్న అనంతరం ప్రకటన విడుదల చేశారు

సేవలకు గుర్తింపుగా డైరెక్టర్ పదవి


డైరెక్టర్‌ను సన్మానిస్తున్నతిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా ఎల్వీ ప్రసాద్‌కు ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం లభించిందని పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్‌తో కలిసి ప్రసాద్‌ను సన్మానించారు. బసప్ప, కురువ పెద్ద అమీన్, మల్లెల పుల్లారెడ్డి, విజయకుమార్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

● నగర పాలక కమిషనర్ పి. విశ్వనాథ్


కొండారెడ్డి బురుజు వద్ద ప్రతిజ్ఞ కమిషనర్, విద్యార్థినులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల, టౌన్ మోడల్ పాఠశాల విద్యార్థులతో కలిసి కొండారెడ్డి బురుజు వరకు ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పరిశుభ్రత అలవాట్లు చిన్నప్పటి నుంచి నేర్చుకోవాలన్నారు. అందరిలో బాధ్యతాయుతమైన ఆలోచనలు ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజారోగ్య అధికారి డా. నాగశివప్రసాద్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి: జడ్పీ సీఈవో

ప్రతి ఒక్కరు వ్యక్తిగత, సమాజ పరిశుభ్రత పాటించాలని జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి ఆదేశించారు. పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఆవరణలో మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్రలో భాగంగా కార్యాలయంలోని పరిసరాలను అధికారులు శుభ్రం చేసుకున్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


నన్నూరులో పుస్తక ప్రదర్శన

ఓర్వకల్లు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని ఓర్వకల్లు, నన్నూరు గ్రంథాలయ శాఖాధికారులు హనుమే నాయక్, కౌసల్య అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాలు నిర్వహించారు.

త్యాగాలు స్ఫూర్తి కావాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ డా.ఎ.సిరి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తి కావాలని కలెక్టర్ డా.ఎ.సిరి అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ అధ్వర్యంలో బిర్సా ముండా 150వ జయంతి నిర్వహించారు. బిర్సా ముండా బ్రిటీష్ వారి పన్నుల రద్దు కోసం గిరిజనులను ఏకం చేసి విప్లవ పోరాటం చేశారన్నారు. డీఆర్వో వెంకటనారాయ ణమ్మ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి డి.సురేష్, పాల్గొన్నారు.

పరిశుభ్రతను అలవర్చుకోవాలి

కల్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను అలవర్చుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ ఆర్.ప్రదీప్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్ఏఓ చిన్నరాఘవులు, కన్‌స్ట్రక్షన్ ఈఈ భాస్కర్ రావు ఉన్నారు.

● కల్లూరు మండలం కే.మార్కాపురంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డి.రామాంజనేయులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనం ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు

కర్నూలు క్రైం, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): మైనర్లు వాహనం నడిపితే వారి తల్లిదండ్రులపై చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ బాబు ప్రసాద్ పర్యవేక్షణలో శనివారం నగరంలో తనిఖీలు చేశారు. మైనర్లను, మద్యం తాగి నడపుతున్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి మైనర్లకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. రెండోసారి పట్టుబడితే జరిమానా విధిస్తామన్నారు.

బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలి


మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

కర్నూలు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం సూచించిన మేరకు ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలోనే నిర్వహించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు బి. బతుకన్న డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ బీహార్‌లో మొత్తం 7.42 కోట్ల ఓటర్లు మాత్రమే ఉంటే 7.45 కోట్ల ఓట్లు ఎలా పోలయ్యాయని ప్రశ్నించారు. బీజేపీ అడ్డదారిలో గెలిచిందని ఆరోపించారు. రాహుల్ భారత్ జోడో యాత్రలో ప్రజల్లో చైతన్యం తెచ్చారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కాంగ్రెస్ పార్టీ వైపు ఉన్నారని తెలిపారు. పార్టీ సిటీ అధ్యక్షుడు రేపల్లే ప్రతాప్, డీసీసీ మాజీ సెక్రటరీ సుబ్రమణ్యాం శెట్టి, సీటి అధ్యక్షులు సత్యరాజు పాల్గొన్నారు.

స్థలాల కబ్జాపై విచారణ జరపాలి



ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న పెద్దహుల్తి గ్రామస్థులు

పత్తికొండ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెద్దహుల్తి గ్రామ లేఅవుట్‌లో కబ్జాకు గురవుతున్న స్థలాలపై విచారణ జరిపి, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని పెద్దహుల్తి గ్రామస్తులు దాసరి పులికొండ, కారుమంచి, రంగన్నలు అధికారులను కోరారు. శనివారం స్థానిక ఆర్డీవో భరత్‌నాయక్‌కు గ్రామస్థులు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ జూటూరు రెవెన్యూ పరిధిలోని 130/2 సర్వే నంబర్‌లో పెద్దహుల్తి గ్రామానికి చెందిన నిరుపేదలకు జగనన్న కాలనీ కింద గతంలో ఇంటి స్థలాలను కేటాయించడం జరిగిందన్నారు. అయితే ఆ కాలనీలో అక్కడక్కడ కాలనీ ప్రజా ఉత్సవాల కోసం వదిలి వేసిన స్థలాలపై కొంతమంది అక్రమార్కులు కన్నేసి స్థానిక రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై స్థలాలను కబ్జా చేసేందుకు పూనుకున్నారన్నారు. విలువైన స్థలాలను కబ్జాల బారిన పడకుండా తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన ఆర్డీఓ మాట్లాడుతూ ఫిర్యాదుపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అశోక్, బాలు, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు సరి చూసుకోవాలి

మద్దికెర, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండంలోని రైతులు సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు సరిచేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి రవి అన్నారు. శనివారం మద్దికెర గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ఈ క్రాప్ పంట నమోదు వివరాలను నోటీస్ బోర్డులో ఎక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 28వేల హెక్టార్లలో రైతులు సాగు చేసిన పంటల వివరాలు ఆన్‌లైన్ చేసిన జాబితాను సంబంధిత రైతు సేవా కేంద్రాలలో పెట్టినట్లు తెలిపారు. దాన్ని రైతులు చూసుకోవాలని, తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. టీడీపీ నాయకులు గొడుగు సతీష్‌కుమార్, వ్యవసాయ సహాయకులు రేష్మా, వీఆర్‌వో పక్కీరప్ప పాల్గొన్నారు.

పట్టుబడితే జైలుకే...

ఆదోని రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే మాత్రం జైలుకు పంపుతామని తాలుకా సీఐ నల్లప్ప తెలిపారు. వాహనాల డ్రైవర్లుగాని, ద్విచక్ర వాహన దారులుగాని మద్యం సేవించి వాహనాలను నడపవద్దని సూచించారు. ఒకవేళ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుపడితే అలాంటివారిని జైలుకు పంపి తీరుతామని, అదే విధంగా ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు అలాంటి డ్రైవర్ల లైసెన్సులు కూడ రద్దు చేస్తామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

దేవనకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేవనకొండ జడ్పీ పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలలో గదులు నాసిరక నిర్మాణాలు చేయడంతో పైకప్పు పెచ్చులూడటం జరుగుతుందని, వర్షం వస్తే మైదానంలో నీటి నిల్వతో విద్యార్థులు అవస్థలు పడటం జరుగుతుందన్నారు. అదనపు గదులు లేకపోవడంతో విద్యార్థులు చదువుకునేందుకు ఇబ్బందులు పడటం జరుగుతుందన్నారు. ప్రభుత్వం దృష్టిసారించి సమస్యలు పరిష్కరించాలన్నారు. మురళి, బాలరాజు, భరత్, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలను ప్రభుత్వమే కొనసాగించాలి

ఆదోని అగ్రికల్చర్ , నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాల నిర్వహణ ప్రభుత్వమే కొనసాగించాలని పీడీఎస్‌వో రాష్ట్ర నాయకుడు తిరుమలేష్ డిమాండ్ చేశారు. శనివారం ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. రాష్ట్రంలో మెడికల్ కళాశాలను ప్రభుత్వం పీపీపీ విధానం చేయాలని చూస్తుందన్నారు. మెడికల్ కళాశాలలు తాము నడపలేమని ప్రభుత్వం చెప్పడం భావ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని యధావిధిగా ప్రభుత్వ కళాశాల నిర్మాణాన్ని చేపట్టి అడ్మిషన్లను ప్రారంభించాలని కోరారు. రాజేష్, రాజు, శివ రంగస్వామి పాల్గొన్నారు.

పఠనాసక్తి పెంచుకోవాలి



పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

వెల్దుర్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తిలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం గ్రంథాలయ అధికారిణి తోటమ్మ పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లి పఠనాసక్తి పెంచుకోవాలని సూచించారు. పుస్తకాలను చదివి జ్ఞానాన్ని సముపార్జించాలని అన్నారు. జూనియర్ కళాశాల లైబ్రేరియన్ ఖాజా, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవనకొండ: పుస్తకపఠనంతో లోకం తెలుస్తుందని డిప్యూటీ ఎంపీడీవో గోపాల్, గ్రంథాలయాధికారి శ్రీనివాసులు అన్నారు. 58వ గ్రంథాలయా వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయంలో సరస్వతి పూజ చేశారు. విద్యార్థులు పుస్తకాలను బాగా చదివితే లోకజ్ఞానం వస్తుందన్నారు. విలువైన సమాచారం దొరికేది గ్రంథాలయాలలోనే అన్నారు. పంచాయతీ కార్యదర్శి రఫి పాల్గొన్నారు.

చింతకుంట సొసైటీ చైర్మన్‌గా ప్రకాష్

హాలహర్వి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చింతకుంట సింగిల్ విండో త్రీ సభ్య కమిటీ చైర్మన్‌గా ప్రకాష్ ఎంపికైనట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. శనివారం ప్రకాష్ మాట్లాడుతూ టీడీపీ పార్టీ తనను గుర్తించి రైతులకు సేవచేసే అవకాశం కల్పించారని, తాను రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు. రైతులకు బ్యాంకు తరపున ఎప్పటికప్పుడు రుణాలు అందించి రైతులు ఆర్థికంగా రాణించేలా కృషి చేస్తానన్నారు.

దేశంలో బీజేపీ హవా

ఆదోని టౌన్ , నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన బీహార్ రాష్ట్ర ఎన్నికల ఫలితాలను చూస్తుంటే రానున్న రోజులలో దేశంలో బీజేపీ హవా కొనసాగనున్నట్లు స్పష్టంగా తెలుస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, నరేంద్ర మోడీ పరిపాలన పై ప్రజలకు పూర్తిగా నమ్మకం కలిగించడంతోనే బీహార్ రాష్ట్ర ప్రజలు అత్యధికంగా బీజేపీ అభ్యర్థులను గెలిపించారని అన్నారు. రానున్న రోజులలో అన్ని రాష్ట్రాలలో జరిగే ఎన్నికలలో బీజేపీ విజయపరంపర కొనసాగుతుందని రాజకీయ విశ్లేషకులు కూడా భావిస్తున్నారని అన్నారు.

మళ్లీ బీపీఎస్

- క్రమబద్ధీకరణకు అవకాశం
- జీవో జారీ చేసిన ప్రభుత్వం
- ఆగస్టు 31 వరకు నిర్మించిన వాటికే అవకాశం

ఆదోని టౌన్ , నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని అక్రమ కట్టడాలకు క్రమబద్ధీకరణ అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మొదటిసారి బీపీఎస్‌ను అమలు చేసింది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీపీఎస్‌ను కొనసాగించకుండా అక్రమ కట్టడాలకు వందశాతం ఆస్థిపన్నులను పెంచడంతో సామాన్యులు, మధ్య తరగతికి చెందిన వారు భారీగా పెరిగిన ఆస్థి పన్నులను చెల్లించలేక అవస్థలు పడ్డారు. తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోని రావడంతో అనుమతి లేని అక్రమ కట్టడాలకు క్రమబద్ధీకరణకు అవకాశం కలిగింది.

● పాత నిర్మాణాలకు మాత్రమే అవకాశం

1985 జనవరి 1వ తేదీ నుండి 2025 ఆగస్టు 31వ తేదీ వరకు నిర్మించిన కట్టడాలకు ఈ ఒక్కసారికి మాత్రమే క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తూ జీవో ఎంఎస్ నెం. 225 ఎంఏయూడీ తేదీ 12.11.25ను ప్రభుత్వం జారీ చేసింది. ప్రభుత్వ స్థలాల్లో, మాస్టర్ ప్లాన్ రోడ్లపైన నదీ పరివాహక ప్రాంతాలలో నిర్మించిన నిర్మాణాల తోపాటు, కోర్టు వివాదాలు ఉన్న వాటికి మాత్రం క్రమబద్ధీకరణ వర్తించదు.

● దరఖాస్తు ఇలా...

జీవో విడుదల అయిన 120 రోజులలోగా ఆన్‌లైన్‌లో లైసెన్స్ టెక్నికల్ పర్సన్(ఎల్‌టీపీ)ల ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ముందుగా రూ. 10 వేలు ఆన్‌లైన్ ద్వారా మొదటి విడతగా చెల్లిస్తూ అన్ని డాక్యుమెంట్లను జతచేయాల్సి ఉంటుంది.

● వీటికి రాయితీ వర్తింపు

ప్రభుత్వం అపరాధ రుసుము చెల్లింపులో కొన్నింటికి రాయితీ ప్రకటించింది. 1997 డిసెంబరు 31 కంటే ముందు జరిగిన నిర్మాణాలకు 50 శాతం రాయితీ ప్రకటించగా, 50 చదరపు అడుగుల స్థలాల్లో నిర్మించిన వాటికి ఎలాంటి జరిమానా లేకుండా పూర్తి మాఫీకు అవకాశం కల్పించారు.



పాలిమేరలోని అక్రమ కట్టడాలు

స్పందించని వారిపై చర్యలు



ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని అక్రమ నిర్మాణదారులు వినియోగించుకోవాలి. క్రమబద్ధీకరించుకోని అక్రమ నిర్మాణాలను ప్రభుత్వ జీవో ప్రకారం కూల్చివేస్తాం. భవిష్యత్తులో వాటికి ఎలాంటి అనుమతులు ఇచ్చే అవకాశం ఉండదు.

● శిరీష, అసిస్టెంట్ ప్లానర్

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి



టీడీపీ ఇన్‌చార్జిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఆలూరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని కాత్రికి గ్రామానికి వచ్చిన ఆమెకు గ్రామ టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం టీడీపీ ఇన్‌చార్జి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి సీఎం చంద్రబాబు పేదలకు అండగా నిలిచాడన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచ దేశాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు చూస్తున్నాయన్నారు. వేదావతి ప్రాజెక్టు నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని, రహదారులు, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటేశ్వర్లు, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కటారుకొండ శ్రీనివాసులు, సింగిల్‌విండో చైర్మన్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రకాష్, ఈరన్న, దేవేంద్రప్ప, రహిమాన్ పాల్గొన్నారు.

షష్టి ఉత్సవాలకు టీజీ వెంకటేశ్‌కు ఆహ్వానం



టీజీ వెంకటేశ్‌ను ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

మద్దికెర, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దమ్మకుంట సమీపంలో వెలసిన సుబ్రమణేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25, 26, 27 తేదిలో జరిగే సుబ్రమణ్యం స్వామి షష్టి ఉత్సవాలకు రాజ్యసభ సభ్యుడు మాజీ టీజీ వెంకటేశ్ హాజరు కావాలని శనివారం ఆలయ నిర్వాహకులు విజయ్‌ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో కలసి ఆహ్వానించి స్వామి వారి చిత్రపటాన్ని షీల్డ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షష్టి ఉత్సవాలకు నా వంతు సహకారం అందజేస్తానని అన్నారు. నూతనంగా నిర్మిస్తున్న దేవాలయంకు తన సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జయరామిరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దివ్యాంగులను వేధించొద్దు



మాట్లాడుతున్న సంఘం నాయకుడు వెంకటేశులు

ఆదోని రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సర్టిఫికేట్ల వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులను వేధించొద్దని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశులు తెలిపారు. శనివారం సర్టిఫికేట్ రీ వెర్ఫికేషన్ కోసం డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున దివ్యాంగులు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్యులు, ప్రభుత్వ అధికారులు మనస్సుపెట్టి ఆలోచించాలని దివ్యాంగులను వేధించొద్దని, పదే పదే వెరిఫికేషన్ల పేరుతో వారిని ఆసుపత్రుల చుట్టూ తిప్పవద్దని కోరారు.

సాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తాం



నీటిని విడుదల చేస్తున్న ఆలూరు బ్రాంచ్ కెనాల్ డీసీ అధ్యక్షుడు

చిప్పగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతుల సాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తామని ఆలూరు బ్రాంచ్ కెనాల్ డీసీ అధ్యక్షులు అన్నారు. శనివారం ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి సూచన మేరకు హెచ్ఎన్ఎస్ కాలువ నుంచి అర్ధగేరి వరకు నీటిని విడుదల చేశారు. రైతుల పంటలకు నీటిని ఉపయోగించుకోవాలన్నారు. మల్లికార్జునపల్లి రైతులు, డేగులపాడు నీటి సంఘం, సర్పంచ్ రామాంజనేయులు, మల్లికార్జునపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారికే పదవులు

ఆలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు పదవులు వస్తాయని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. ఆలూరు పట్టణ టీడీపీ అధ్యక్షులుగా ఎన్నికైన రవికృష్ణ (కిట్టు), ఉపాధ్యక్షులుగా ఎన్నికైన పెయింట్ గోవింద్‌లను మండల టీడీపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు వేసిన కమిటీల్లో అన్నివర్గాలకు, పని చేసిన కార్యకర్తలకు ప్రాధాన్యత కల్పించామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసప్ప, నెట్టప్ప, డా.వెంకన్న, ముద్దురంగ, గూళ్యం రామాంజనేయులు, ప్రతాప్, రమేష్, అతిధి హోటల్ షేక్షా, ఆంజనేయ పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధి పరీక్షలు తప్పనిసరి

మద్దికెర, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పశువులకు గర్భకోశవ్యాధి పరీక్షలు తప్పని సరిగా చేయించాలని పశువైద్యాధికారి లక్ష్మన్న అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎం అగ్రహారం గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో బాగంగా పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని దాదాపు 50 పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పశువులకు సాధారణ పరీక్షలు నిర్వహించారు. పశుపెంపకంలో పశుయజమానులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయుడు, కార్యదర్శి విజయ్‌కుమార్, సిబ్బంది శిల్ప ఉన్నారు.

వైభవంగా నవగ్రహ ప్రతిష్ఠ



జొన్నగిరిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు

తుగ్గలి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ధ్వజస్తంభ విగ్రహాలు, నవగ్రహాల ఏర్పాట్లు అంగరంగవైభవంగా నిర్వహించారు. శనివారం మండల పరిధిలోని జొన్నగిరి రామలింగేశ్వర దేవాలయంలో దేవాలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్ఠను దాత జయరామిరెడ్డి ధ్వజస్తంభాన్ని అందించగా గ్రామపెద్దల సమక్షంలో వేదపండితులచేత ధ్వజస్తంభ ప్రతిష్ఠ నవగ్రహాలు, విగ్రహాలను వేదమంత్రోచ్ఛరణతో ప్రతిష్ఠించారు. జియో మైసూర్ కంపెనీ దేవాలయం ప్రాంగణంలో ఉన్న పాడుబడ్డ బావిని పూడ్చడంతోపాటు షెడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి జయరామిరెడ్డి, గోపి, బాలన్న, పెద్దతిమ్మయ్య, నెల్లూరప్ప, ఎస్ఐ మల్లిఖార్జున పాల్గొన్నారు.

సాగునీటి సమస్యలపై పోరాటం

దేవనకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగు నీటి సమస్యలపై పోరాటం చేయనున్నట్లు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశులు, నాయకులు వీరశేకర్ అన్నారు. తెర్నేకల్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ హంద్రీ నీవా ద్వారా మండలంలో 46 వేల ఎకరాలు ఆయకట్టు కాగా, సరైన కాలువలు లేకపోవడంతో పది వేల ఎకరాలకు మించి నీలరందని పరిస్థితి నెలకొందన్నారు. గుండ్లకొండ స్లూయిజ్ ఏర్పాటు చేసి మిగిలిన గ్రామాలకు కూడా సాగు తాగునీరు వచ్చేంత వరకు సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం చేయన్నుట్లు వారు తెలిపారు. ఈ నెల 18 నుండి మండల వ్యాప్తంగా బైక్ ర్యాలీ చేసి, 19న తహసీల్దార్ కార్యాలయం ఎదుట, 20న పత్తికొండ ఆర్డీవో కార్యాలయాల వద్ద ధర్నాలు చేయనున్నట్లు తెలిపారు. నాయకులు యూసుఫ్‌బాష, సూరి, పరమేష, పాండు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన ఉండాలి



అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచిన వారిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

ఆదోని అగ్రికల్చర్ , నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య పరిరక్షణపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ బాలస్వామి, మాస్టర్ ట్రైనర్ డాక్టర్ సంధ్యారాణి పేర్కొన్నారు. శనివారం ఆర్ట్స్ కళాశాలలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు భాగంగా విద్యార్థులకు ఆరోగ్యం- పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ విద్యార్థినీలకు ఆర్గానిక్ శానిటరీ ప్యాడ్స్‌పై అవగాహన కల్పించారు. కెమికల్ ప్యాడ్స్ వల్ల వచ్చే అనర్థాలపై వివరించారు. అనంతరం ఇటీవల చెన్నైలో 23వ ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలలో ప్రతిభ కనబరిచిన మహిళ మాస్టర్ అథ్లెట్స్ వినీత మిరియాల, సీమ ఎలిగే, శ్వేతలను ప్రిన్సిపల్ ఘనంగా సన్మానించారు. ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారి జోనాథన్ విక్లిప్, ఉమాదేవి, వెంకట్రామి రెడ్డి, సంతోషి, నేత్రవతి, కీర్తి పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ పూజలు



పూజలో పాల్గొన్న బొజ్జమ్మ దంపతులు

దేవనకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టులోని చెన్నకేశవస్వామి ఆలయంలో మూల విరాట్‌కు జీర్ణోద్ధరణ పూజలు చేశారు. ఆలయ సమీపంలో గదిలో స్వామి వారిని ప్రతిష్ఠించి ఆలయ నిర్మాణ పనులు చేయనున్నట్లు వాల్మీకి చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు తెలిపారు.రూ.1.20 కోట్లతో నూతన ఆయలం, ధ్వజస్తంభం, ప్రహరి గోడ, వివిధ పనులు చేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా ఆయలంలో ప్రత్యేక హోమాలు, జీర్ణోద్ధరణ పూజలు బొజ్జమ్మ దంపతులు చేశారు.

ప్రభుత్వ లక్ష్యం..స్వచ్ఛాంధ్రప్రదేశ్



అలూరు: స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న వైకుంఠం జ్యోతి



ఆదోని: కార్యక్రమంలో పాల్గొన్నగుడిసె కృష్ణమ్మ

ఆలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. శనివారం ఆలూరు పట్టణంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా ఆలూరు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ కూడలిలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, రోగాలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఎంపీడీఓ మద్దిలేటిస్వామి, ఏపీఓశ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి జిలానీ, టీడీపీ నాయకులు నరసప్ప, ముద్దురంగ, గూళ్యం రామాంజినేయులు పాల్గొన్నారు.

ఆదోని: స్వచ్ఛత కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, పౌరులందరి బాధ్యత అని టీడీపీ సీనియర్ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ పేర్కొన్నారు. ఆమె ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛభారత్-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయ్యింది. కార్యక్రమంలో గుడిసె కృష్ణమ్మతో పాటు 100 మందికి పైగా టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టీడీపీ నేతలు కపటి మాధవ, మురళి, గోపాల్, మల్లికార్జున పాల్గొన్నారు.

దేవనకొండ: పరిసరాల పరిశుభ్రత సమాజంలోని ప్రతి పౌరుని బాధ్యతన్ని వాల్మీకి చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, డీపూటీ ఎంపీడీవో గోపాల్ అన్నారు. స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా దేవనకొండలో ఎంపీడీవో కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ చేసి బస్టాండ్‌లో మానవహారం చేశారు. జిల్లెడుబుడకలలో సచివాలయ సిబ్బందితో కలసి పరిసరాలను శుభ్రం చేసి, ప్రతిజ్ఞ చేశారు. వైద్యాధికారి కళ్యాణ్, ఏపీవో రాజు, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, పంచాయతి కార్యదర్శి రఫీ, తదితరులు పాల్గొన్నారు అన్నారు.

ఆదోని టౌన్ : స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మునిసిపల్ సిబ్బంది శనివారం పట్టణ ప్రధాన రహదారులలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు పారిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి కమిషనర్ నాసిర్ హుస్సేన్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణతో పాటు అందరి ఆరోగ్యం పదిలంగా ఉండటం కోసం వ్యక్తిగత పారిశుభ్రతతో పాటు, సామూహిక పారిశుభ్రతను కూడా పాటించాలని అన్నారు. మునిసిపాలిటీకు చెందిన అన్ని శాఖల ఉద్యోగులతో పాటు మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

హాలహర్వి: గ్రామాల్లోని వీధుల్లో పరిశుభ్రత పాటించి స్వర్ణాంధ్రను స్వచ్ఛాంధ్రగా మార్చుకుందామని ఎంపీడీఓ వరలక్ష్మి అన్నారు. శనివారం స్వచ్ఛ భారత్‌పై ర్యాలీ నిర్వహించారు. ప్రతి పంచాయతీలోనూ పరిశుభ్రత పాటించి చెత్తతో సంపద సృష్టిద్దామని ఆమె పేర్కొన్నారు.

వెల్దుర్తి: మండలంలో మల్లెపల్లి గ్రామంలో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో రవికిశోర్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ సుహాసినమ్మ, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మన్న, వీఆర్‌వో ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దికెర: మండలంలోని ఆయాగ్రామాలలోని ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి, సర్పంచ్ బండారు సుహాసిని, మండల టీడీపీ అధ్యక్షుడు లక్ష్మినారాయణ, తాలూకా తెలుగుయువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ్ ఆంధ్ర లో బాగంగా మండలంలోని మద్దికెర, ఎం అగ్రహారం గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు పంచాయతీ కార్యదర్శి శివకుమార్, హెచ్ఎం దేవేంద్రప్ప, పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలోని గ్రామాల్లో ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ గీతావాణి, సీడీపీఓ మద్దమ్మలు అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని స్థానిక సచివాలయం ముందు సర్పంచ్ మూలింటి రాధమ్మ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాలల విద్యార్థుల చేత పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఏపీఓ రామకృష్ణ, ఏపీఎం జనార్దన్, కార్యదర్శి విజయ్‌రాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుగ్గలి : మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పత్తికొండ డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి రామచంద్రారెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ శ్రీహరి అన్నారు. శనివారం రాతన గ్రామంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్, సర్పంచు అన్వర్‌బాషా, ప్రధానోపాధ్యాయులు రమేశ్ తదితరులు ఉన్నారు.

ఆదోని అగ్రికల్చర్ : స్వచ్ఛ మార్కెట్ యార్డ్‌గా తీర్చిదిద్దుకుందామని మార్కెట్ యార్డ్ కార్యదర్శి గోవిందు అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్రలో కార్యక్రమాన్ని చేపట్టారు. చైర్మన్ శారద శంకర్, వైస్ చైర్మన్ ఆధూరి విజయ్ కృష్ణతో పాటు సిబ్బంది స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. సూపర్వైజర్లు నాగరాజు, అశోక్, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆకాశాన్నంటుతున్న ధరలు

● ట్రాక్టర్ పశుగ్రాసం రూ.18 వేలు

గోనెగండ్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది గ్రాసం ధర చుక్కలు చూపుతోంది. ఆదోని డివిజన్‌లో గ్రాసం వచ్చే పంటలు ఎక్కువగా సాగుచేయక పోవడం, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రాసం దెబ్బతినడం వల్ల ఈ పరస్థితి ఏర్పడింది. గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, కోసిగి, మండలాల్లో ఎక్కువగా వర్షాలు కురియడం, చేతికి అందిన గ్రాసం నల్లగా మారిపోవడం దీనికి తోడు ఈ మండలాలలో పత్తి, మిరప, పంటలు సాగు చేశారు. దీంతో గ్రాసం కొరత ఏర్పడింది. చాలామంది రైతులు గ్రాసం కొరత కారణంగా పశువులను కబేళాలకు తరలిస్తున్నారు. ఈ ఏడాది వరి, వేరుశనగ, పంటలను రైతులు ఎక్కువగా సాగుచేయక పోవడం చేసిన చోట గ్రాసం నల్లబడ టంతో వాటి ధర విపరీతంగా పెరిగింది. ట్రాక్టర్ గ్రాసం రూ.15వేల నుంచి 18 వేల వరకు పలుకుతుంది. గోనెగండ్ల మండలంలో ఆవులు, ఎద్దులు, 15,530, బర్రెలు 5,603, గొర్రెలు, 65,257, మేకలు 740, కోళ్ల బాతులు 30,665లు ఉన్నాయి. గ్రాసం కొరత కారణంగా బళ్లారి, ప్రాంతాల నుంచి పశువుల యజమానులు గ్రాసంను దిగుబడి చేసుకుంటున్నారు. అలాగే వరి, వేరుశనగ పంట ఎక్కువగా సాగు చేసిన చోట నుంచి గ్రాసం దిగుబడిచేసుకునేందుకు పశు యజమానులు సిద్ధమయ్యారు.



‘ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి’



ఎస్టీయూ మండల కార్యవర్గ సభ్యులను సన్మానించిన నాయకులు

మంత్రాలయం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమండ్ చేశారు. మంత్రాలయంలో ఎస్టీయూ వార్షిక కౌన్సిలర్ సమావేశం వీరేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఎస్టీయూ మండలం కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా చిన్న తిమ్మన్న, గౌరవ అధ్యక్షుడిగా వీరేశ్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, ప్రభాకార్, సోమేశ్, శాంతి, ప్రధాన కార్యదర్శిగా జె.వీరేశ్, ఆర్థిక కార్యదర్శిగా శీలప్ప, మహిళా కన్వీనర్‌గా కృష్ణవేణి, సీపీఎస్ కన్వీనర్‌గా ప్రభాకర్, కార్యదర్శులుగా రామకృష్ణ, హనుమంతు, సీయూ ఆనంద్, శ్వేత, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా బసవరాజు, నాగరాజు, రామచంద్ర, రామకృష్ణరెడ్డి, ఆర్థిక కమిటీ సభ్యులుగా కృష్ణ, లలితమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఘనంగా కమ్మ కులస్థుల కార్తీక వనభోజనం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కమ్మ సంఘం నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఆదోని రోడ్డులో ఉన్న విశాల గార్డెన్‌లో శనివారం ఎమ్మిగనూరు కమ్మ సేవా సంఘం ఆద్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం స్థానికంగా వీరవెంకట సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. అలాగే ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వనభోజన కార్యక్రమానికి హాజరైన నాయకులు కొంకా ఉమాపతి నాయుడు, తమ్మినేని రమేష్, మేడసాని దుర్గాప్రసాద్, భాస్కర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ కమ్మ కులస్థులంతా ఐక్యంగా ఉండి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొండయ్య చౌదరి, నాయకులు మహేంద్ర బాబు, భాస్కర్, నరసింహరావు, రవిశేఖర్, కాకర్ల వీరేష్ పాల్గొన్నారు.

బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలి



డీసీవో వెంకటకృష్ణకు వినతి పత్రం ఇస్తున్న చైర్మన్, డైరెక్టర్లు

ఎమ్మిగనూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మొండి బకాయిలు పెరిగితే ఆర్థిక పరిస్థితి దెబ్బతినే అవకాశం ఉంటుందని, మొండిబకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని డీసీవో వెంకటకృష్ణ సూచించారు. 72వ సహకార వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ది ఎమ్మిగనూరు టౌన్‌బ్యాంకులో సహకార వారోత్సవాలను చైర్మన్ ఉరుకుందయ్య శెట్టి ఆధ్వర్యంలో నిర్వహించారు. డీసీవో మాట్లాడుతూ బ్యాంకులో ఎన్‌పీఏ పెరుగుతుంటే ఆర్థికస్థితి దెబ్బతింటుందన్నారు. లోన్ పరిమితిని రూ.5 లక్షలనుంచి రూ. 10 లక్షలకు పెంచాలని, ఎన్‌పీఏ ఖాతాలకు యాక్షన్ సెల్ ఏర్పాటు చేయాలని, ఎన్‌పీఏలను తగ్గించటానికి అవసరమైన యాక్షన్ సేల్ అనుమతులు ఇవ్వాలని, డిగ్రీ అయిన పాత రుణాలను నెల రోజుల వ్యవధిలో విక్రయాలకు పంపించేందుకు అధికార యంత్రాంగం పూర్తి సహకారం అందించాలని డైరెక్టర్లు డీసీవోకు వినతి పత్రం ఇచ్చారు. ఇందుకు ఆయన పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. వైస్ చైర్మన్ బండ నరసప్ప, డైరెక్టర్లు దోమా భీమేష్, ఉప్పర రవికుమార్, వెంకటేశ్వర రెడ్డి, శాలేమ్, నరసింహులు, గిరిబాబు, బ్యాంకు సీఈవో జి.కళ, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల హక్కుల కోసం పోరాటం



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల హక్కులకోసం దేశవ్యాప్తంగా ఐలు(ఆలిండియా లాయర్స్ యూనియన్) పోరాటం చేస్తోందని రాష్ట్ర అధ్యక్షుడు కె. కుమార్, జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ తెలిపారు. శనివారం పట్టణంలోని ఎన్‌జీవోస్ కార్యాలయంలో న్యాయవాదుల సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ ధ్యక్షుడిగా చార్లెస్, అధ్యక్షులుగా రషీదుల్లా, ప్రధాన కార్యదర్శిగా అడ్డాకుల తిమ్మప్ప, ఉపాధ్యక్షులుగా అనిల్, రామ్మూర్తి, మల్లికార్జున, అజారుద్దీన్, సహాయ కార్యదర్శులుగా జయచంద్ర, ఇర్షాద్, మధు, నబీ రసూల్, కోశాధికారిగా దస్తగిరి, కమిటీ సభ్యులుగా అష్రఫ్‌తో పాటు మరో ఐదుగురిని ఎన్నుకున్నారు.

‘గ్రామకంఠం భూమిని కాపాడాలి’



ధర్నా చేస్తున్న గుడికల్ వాసులు

ఎమ్మిగనూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడికల్‌లో ఉన్న 1.80 ఎకరాల గ్రామకంఠకం భూమిని కాపాడాలని కోరుతూ గుడికల్ గ్రామానికి చెందిన పలువురు శనివారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన మెనుకబడిన, నిరుపేదకుటుంబాలు స్థానికంగా జీవిస్తున్నామని, ఇళ్లస్థలాలు లేనివారికి ఆ స్థలాన్ని ఇవ్వాలని కోరారు. ఇటీవల కొంతమంది అధికార పార్టీకి చెందిన వారు ఆ స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్నారని, ఇది జరిగితే ఇళ్లస్థలాలు లేని వారంతా ఇబ్బందులకు గురువుతామని అన్నారు. అధికారులు పరిశీలించి గ్రామకంఠకం భూమిని కాపాడటంతో పాటు నిరుపేదలైన మాకు పంపిణీ చేయాలని కోరారు. అనంతరం వినతి పత్రాన్ని డీటీకి అందజేశారు. డీటీ, వీఆర్వో, వీఆర్ఏలు గుడికల్ గ్రామానికి వెళ్లి స్థలాన్ని పరిశీలించారు. స్థలంలో ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: టీడీపీ



గాజులదిన్నెలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న నాయకులు

గోనెగండ్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, మాజీ ఎంపీపీ హనుమంతు, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ ప్రభాకర్ నాయుడు అన్నారు. గాజులదిన్నె గ్రామంలో రూ. 95 లక్షలతో చేపడు తున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను శనివారం వారు పరిశీలించారు. పనులు నాణ్యతతో చేయాలని క్రాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్ర మంలో పీఆర్ఏఈ శివశంకర్, హరికృష్ణ, గాజులదిన్నె ప్రాజెక్టు మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

మంత్రాలయం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సమాజంలో తాను వెలుగుతూ ఇతరులకు విద్య, బుద్ధులు నేర్పి ఉన్నత స్థాయిలో నిలిపే వారే గురువులని, ఈ వృత్తి గౌరవప్రదమైనదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్, టీడీపీ నాయకుడు నర్సన్న ఆచారి అన్నారు. మండలంలోని మాలపల్లి ప్రాథమిక బీసీ, మెయిన్ పాఠశాలలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలిపై వెళ్లిన సత్యనారాయణ, అరవింద, అనూరాధ, రేవతిని హెచ్‌ఎంలు కేఆర్ సునీత, చంద్రపాల్ ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బందికి మెమెంటోలు అందజేసి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్లు రామకృష్ణ, నాగరాజు, టీడీపీ నాయకులు జయరాం, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, భారతి, లక్ష్మి, అక్షిత భారతి, మాధురి పాల్గొన్నారు.

కుష్ఠు నివారణపై అవగాహన పెంచుకోవాలి



కోసిగిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కోసిగి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కుష్ఠు నివారణపై అవగాహన పెంచుకోవాలని నోడల్ అధికారి కోటేశ్వరమ్మ, ఆరోగ్య విస్తరణ అధికారులు శ్రీనివాసులు, ఎల్లప్ప సూచించారు. శనివారం కోసిగిలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆశా వర్కర్లతో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుంచి 30వ తేది వరకు కుష్ఠు వ్యాధి గ్రస్తుల గుర్తింపునకు ఇంటింటి సర్వే చేస్తున్నామని చెప్పారు. సూపర్‌వైజర్లు జయమ్మ, రాముడు, ఆరోగ్యకార్యకర్త మల్లికార్జున, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బిర్సా ముండాకు ఘన నివాళి

ఎమ్మిగనూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన, ఆదివాసి తెగల నాయకుడు బిర్సాముండా జయంతిని శనివారం బీఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పట్టణ పోలీసు స్టేషన్‌లో నిర్వహించారు. బీఎస్‌ఎస్ నాయకులు రామతీర్థం అమ్రేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిర్సా ముండా చిత్రపటానికి పట్టణ ఎస్ఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ కిష్టప్ప నాయక్, నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జనజాతీయ గౌరవ్ దివస్ రోజున బిర్సాముండా జరుపుకోవటం గర్వకారణమని రామతీర్థం అమ్రేశ్ అన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ట్రాఫిక్ నటరాజ్, నాయకులు ప్రతాప్, నాగార్జున, వినోద్ పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

గోనెగండ్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ముస్లిం సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా నాయకులు బేతాళబడేసా, మైనార్టీ నాయకలు నజీర్‌సాహెబ్, డాక్టర్ మిన్నల్ల, మహల్ రహంతుల్లా అన్నారు. గోనెగండ్లలోని టీడీపీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇమామ్‌లు, మౌజన్‌లకు ఇవ్వాల్సిన వేతనాలను వైసీపీ ప్రభుత్వం 2024 ఏప్రిల్, మే, జూన్ నెలల వేతనాలు పెండింగ్ పెట్టిందని, అయితే కూటమి ప్రభుత్వం వచ్చాకా ఆ మూడు నెలల జీతంతో పాటు 2024 జూలై, నుంచి డిసెంబరు వరకు వేతనాల కోసం రూ. 45 కోట్లను 2025 ఫిబ్రవరిలో విడుదల చేశారని తెలిపారు. ఇప్పుడు 2025 జనవరి నుంచి సెప్టెంబర వరక ఉన్న 9 నెలల వేతనాల కోసం మరో రూ. 90 కోట్లు విడుదల చేశారని తెలిపారు. మదీనా, అక్బర్, నూరహమ్మద్, కొత్తింటి ఫకృద్దీన్, చాంద్‌బాషా, మహమ్మద్, కొండల షఫీ, రాంపురం రఫీక్, పాముల అజీజ్, డాక్టర్ నూరహమ్మద్ పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కన్నడ సినీ హాస్యనటుడు



శ్రీమఠంలో ప్రదక్షిణ చేస్తున్న కన్నడ సినీ హాస్య నటుడు

మంత్రాలయం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కన్నడ సినీ హాస్య నటుడు, బుల్లితెర నటుడు, యాంకర్ శశికచి చంద్ర శనివారం మంత్రాలయానికి వచ్చారు. ఆయనకు మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాస రావు, సురేష్‌కోణాపూర్ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈయన వెంట అనంత పురాణిక్, వ్యాసరాజ్ ఆచార్, జేపి స్వామి,జయతీర్థ ఆచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్ ఆచార్ ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి: కాంగ్రెస్



అధికారికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గోనెగండ్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కాశీంవలి కోరారు. గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ రెవెన్యూ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేశారు. కాశీంవలి మాట్లాడుతూ రైతులకు పరిహారం ఇవ్వాలని కోరుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంటలకు తీవ్రంగా నష్టం కలిగిందన్నారు. అధికారులు సర్వేలు జరిపి నివేదిక తయారు చేసి నష్టం కలిగిన రైతులను గుర్తించి ఎకరాకు రూ. 30వేలు పరిహారం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఉల్లి, వేరుశనగ, పత్తి, మిరప, వరి పంటకు మద్దత్తు ధర లేక పోవడంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో వలసలను నివారించాలని కోరారు. అనంతరం ప్రభుత్వం ఆసుపత్రిని సందర్శించారు. రోగులతో మాట్లాడారు. అలాగే రక్త పరీక్షలు చేసే సిబ్బందితో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 30 పడకల ఆసుపత్రిని 6 పడకల ఆసుపత్రిగా మార్చడం సరికాదన్నారు. నాయకులు షబ్బీర్, పార్టీ మండల అధ్యక్షుడు కాశీంసాబ్, షాకిర్, నాయుడు, సోమన్న పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు సేవా దృక్పథం కలిగి ఉండాలని హనుమాపురం వైసీపీ నాయకుడు హనుమప్పనాయుడు అన్నారు. శనివారం ఎమ్మిగనూరులోని వీవర్స్ కాలనీ మైదానంలో జరుగుతున్న 87వ విశ్వశాంతి మహాయాగానికి రూ.7 వేలు విరాళాన్ని అందజేశారు. విరాళం అందజేసిన దాతకు శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజి ఫల, పుష్ప, మంత్రాక్షింతలిచ్చి ఆశీర్వదించారు.

సీజనల్ హాస్టళ్లను ప్రారంభించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేశ్

కోసిగి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కోసిగి మండలానికి విద్యార్థుల వలసల నివారణ కోసం 16 సీజనల్ హాస్టళ్లు మంజూరయ్యాయని, వాటిని వెంటనే ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేశ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన కోసిగిలో మాట్లాడుతూ ఈ ఏడాది మండలం నుంచి అధిక సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు వలస బాట పట్టారని విద్యార్థులు తల్లిదండ్రులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంఈవో చొరవ చూపాలన్నారు.

నవరత్నాల రథంపై శోభిల్లిన ఉత్సవమూర్తి



నవరత్నాల రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై విహరించారు. శనివారం కార్తీక దశమి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో రాఘవ్రేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు. నవరత్నాల రథంపై ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అధిష్ఠించి హారతులు ఇచ్చిన అనంతరం ఆలయ ప్రాంగణం చుట్టూ అంగరంగా వైభవంగా ఊరేగించారు. ఉత్సవమూర్తికి ఊంజలసేవ నిర్వహించి హారతులిచ్చారు.

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు

కార్తీక దశమి శుభదినం కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు పూజలు బంద్

రాఘవేంద్రస్వామి మఠంలో ఆదివారం ఏకాదశి సందర్భంగా బృందా వనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్యాన్నదానం, రథోత్సవాల ఊరేగింపు, పరిమళ ప్రసాదం, టెంకాయ కొట్టడం బంద్ చేస్తారు. పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, రాఘవేంద్రస్వామి నిజ బృందావనానికి భక్తులు దర్శించుకొనే అవకాశం మాత్రమే శ్రీమఠం అధికారులు కల్పించనున్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



బీజేపీ కార్యాలయం వద్ద సంబరాలు చేసుకుంటున్న నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బీహార్‌లో బీజేపీ కూటమి గెలుపొందటంతో శనివారం ఎమ్మిగనూరులో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలోని పార్టీ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాణసంచా పేల్చి కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. 21వ వార్డు కౌన్సిలర్ దయాసాగర్, నాయకులు బీఎల్ నారాయణ, శ్రీదేవి, బీఎన్ ఈరన్న, బడేసాబ్, తిరుమల్, పద్మావతి, కశీం నాయుడు, నాగరాజు యాదవ్, లోకేష్, శిల్పి భాస్కర్, బజారి, మల్లికార్జున, ఆశోక్, పెద్దయ్య, నాగన్న పాల్గొన్నారు.

అమరవీరులను స్మరించుకుందాం

ఎమ్మిగనూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): భూమికోసం, భుక్తి కోసం సాగిన పోరాటంలో అమరులైన అమరవీరులను సర్మించుకుందామని సీపీఐ ఎంఎల్ న్యూడెమెక్రసీ జిల్లా నాయకులు సత్యన్న అన్నారు. శనివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ సభను నాయకులు బాలరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ స్వేచ్ఛా, సమానత్వం కోసం, నూతన ప్రజాస్వామ్య వ్యవస్థకోసం పోరాడి అనేకమంది అమరులయ్యారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కార్మిక హక్కులకోసం, రైతుల భూమికోసం పోరాటాలు నిర్వహించి చివరి శ్వాసవరకు విప్లవోద్యమానికి అంకితమైన తిక్కన్న, ఉరుకుందప్ప, గోకారి, నరసింగప్పల విప్లవస్ఫూర్తిని గుర్తుచేశారు. వారి అడుగుజాడల్లో నడచి వారి ఆశయసాధనకు కృషిచేద్దామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, జయరాజ్, మల్లేష్, రాజు, ఎల్లప్ప,మాభాష, సుధీర్, వీరేంద్రలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం



కోసిగిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు



అలువాల గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో



మంత్రాలయంలో మానవహారం చేస్తున్న విద్యార్థులు

మంత్రాలయం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదామని తహసీల్దార్ రమాదేవి పిలుపునిచ్చారు. మంత్రాలయంలో డిప్యూటీ ఎంపీడీవో రామాంజనేయులు, గ్రామ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. రాఘవేంద్ర సర్కిల్‌లో వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అవగాహన కల్పిస్తూ తమ కాలనీల్లో పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో రాగన్న, హసీనా, సౌజన్య, భవానీ, కవిత, శ్రీనివాసులు, గోవిందు, ప్రసంగీ, శాంతిరాజు, మారెప్ప, ప్రకాష్, భీమేష్ పాల్గొన్నారు.

● మంత్రాలయం మండలంలోని విద్యానగర్ ఎస్ఎంకేవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో నూర్జహాన్, హెచ్‌ఎం లక్ష్మీకాంత్, రామాంజనేయులు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో కవిరాజు, జగదీష్, సునీత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధించ వచ్చునని ఎంపీడీవో మహబుబ్‌బాషా, డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వరయ్యస్వామి సింగిల్ విండో అధ్యక్షుడు నాడిగేరి అయ్యన్న, మార్కెట్ యార్డు చైర్మన్ చింతలగిరి నర్సారెడ్డి అన్నారు. శనివారం కోసిగి మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో బాలికల ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రతలలో భాగంగా బోజనానికి ముందు చేతులు సబ్బుతో ఎలా శుభ్రపరుచుకోవాలో విద్యార్థులకు సూచించారు. మాజీ జడ్పీటీసీ జక్కనగేని వెంకటేష్, వక్రణి వెంకటేష్, జ్ఞానేష్, రాజేష్, పీడీ ఖలీల్ హమ్మద్ పాల్గొన్నారు.



ఇబ్రహీంపురంలో డస్ట్‌బిన్ అందజేస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

నందవరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో సందీప్ ప్రజలకు సూచించారు. మండలంలోని ఇబ్రహీంపురం గ్రామంలో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రజల చేత గ్రామంలో మొక్కలు నాటించారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం డస్ట్ బిన్‌లు పంపిణీ చేశారు. ఆర్ఐ రాఘవేంద్ర రెడ్డి, ఏపీఎం రాఘవేంద్ర, ఏఈ బాలకృష్ణ, ఏపీవో శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి, శంకరమ్మ, గణేష్, నరసింహులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: పచ్చని ప్రకృతి తోనే పర్యవరణం సమతుల్యత సాధ్యం అవుతుందని ఎంపీడీవో మణిమంజరి, అలువాలలో శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్రలో భాగంగా గ్రామంలో పంచాయతీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్‌స్టాండ్ ప్రాంగణం నందు మానవహారం ఏర్పాటు చేశారు. ఉద్యోగులు, విద్యార్థులు, గ్రామ ప్రజలచే ఎంపీడీవో చేయించారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.